# పతిత-పవిత్రత

సి. ఆనందారామం



ప్యూన్ టేబిల్‌మీద పెట్టిన స్లిప్‌ని మరోసారి చదువుకొంది శ్యామల. 'కుసుమ కుమారి.' తలపైకెత్తి "ఆవిడని లోపలికి పంపించు_" అంది_ కాసేపట్లో స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని లోపలకు దొర్లుకుంటూ వచ్చింది కుసుమకుమారి. ఆ పేరుకూ ఆవిడకూ ఏ విధంగానూ సంబంధం లేదు_ మనిషి గుండ్రంగా తయారయింది. పొట్ట బాగా పెరిగింది. తల మూడొంతులు నెరసింది. కళ్ళచుట్టూ నల్లని రేఖలు. చిబుకం క్రింద సంచీలా వదులుగా వేలాడుతున్న చర్మం_లోపలకు వస్తూనే అనవసరంగా నవ్వుతూ అసహజమైన ఆప్యాయత తెచ్చిపెట్టుకున్న కంఠంతో, "శ్యామలా! బాగున్నావా!" అంది. శ్యామల కళ్ళజోడులోంచి ఒకసారి గంభీరంగా చూసింది. ఆ చూపులకు తెచ్చిపెట్టుకున్న కుసుమ నవ్వు ఎగిరిపోయింది. ఎదుటి వ్యక్తుల అంతరాంతరాలలో రహస్యాలన్నీ లాగి బయట పడేస్తున్నట్లుగా వున్నాయి ఆ చూపులు! ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయిపోయినట్లనిపించింది కుసుమకి_

గుటక మింగి "నేను గుర్తులేనా?" అంది కొంత నీరసంగా _ అక్కడికే ఏదో చనువు చూపించబోతూనే_

"గుర్తున్నారు...." నిదానంగా అంది శ్యామల_ కావాలని బహువచనం పలుకుతూ. అలా పలకటంలోనే కుసుమ ఎంత దూరంలో ఉండాలో తెలియజేస్తూ_

బిత్తరపోయింది కుసుమ_ అప్పటికప్పుడు అక్కడినుంచి పారిపోవాలనిపించింది_ కానీ, తనకు ఆవిడతో కావలసిన పని పారిపోవలసినది కాదు_ ఈ అవమానం దిగమింగుకోవలసిందే! అవమానం!.... అవమానం తనకు శ్యామల చేసిందా? శ్యామలకు తను చేసిందా?

ఒక్కసారి ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి_ ఇద్దరి మనసులలోనూ ఒకే భావన_ కుసుమ కళ్ళు వాల్చేసుకుంది_ ఇంక భరించలేకపోయింది. తన హేండ్ బేగ్ చేత్తో పట్టుకుని "వెళ్తాను_" అంది వడిలిపోయిన ముఖంతో_

"కూర్చోండి కుసుమగారూ! వచ్చిన పని చెప్పండి_ నాకు చేతనయితే తప్పకుండా సహాయం చేస్తాను_" అప్పుడే మ్రోగిన ఫోన్ ఒక చేత్తో అందుకుంటూ మరొకచేత్తో రుమాలుతో ముఖం అద్దుకుంటూ నిర్లక్ష్యంగా అంది. ఆమె మాటలలో నిర్లక్ష్యం, అహంకారం అర్థమవుతున్నా సహాయం చేస్తుందన్న ఆశతో, అలాగే కూర్చుండిపోయింది. ఫోన్‌లో ఎవరితోనో నవ్వుతూ మాట్లాడ సాగింది శ్యామల_ ఆమె ఫోన్‌లో మాట్లాడుతున్నంతసేపూ చవటముఖం వేసుకుని కూచుంది కుసుమ. ఫోన్ పెట్టేసి, ఏవో ఫైల్స్‌మీద సంతకాలు పెడ్తూ తల ఎత్తకుండానే "చెప్పండి_" అంది.

ఈ ధోరణి చాలా ఇబ్బందిగా ఉంది కుసుమకి. శ్యామల కొస్త తల ఎత్తి నవ్వితే....మరి కొస్త స్నేహంగా మాట్లాడితే తను వచ్చిన పని చెప్పటానికి హాయిగా వుండేది.

ఇప్పుడు_అసలు_అక్కడినుంచి లేచి పారిపోవాలనిపిస్తోంది_ ఆ పని చేయగలిగితే ఎంత బాగుండును? అలా ప్రవర్తించలేని తన బలహీనతకు తిట్టుకుంటోంది. అలా కూర్చుండిపోతోంది.

శ్యామల తన వాచ్ చూసుకుని "మరో పది నిముషాల్లో నాకు మీటింగ్ వుంది, వెళ్ళాలి_" అంది. కాలింగ్ బెల్ నొక్కి వచ్చిన ప్యూన్‌తో ఏదో పని చెప్పింది.

కుసుమ గొంతు తడారిపోతోంది.

"మా అబ్బాయి బి.ఏ. పాసయ్యాడు. ఫస్ట్‌క్లాస్_ వాడికి ఏదైనా ఉద్యోగం...."

శ్యామల గలగల నవ్వింది.

"ఉద్యోగాలు నా కొంగున మూట కట్టుకున్నానుటండీ!"

కుసుమ మాట్లాడలేకపోయింది. గుటక మింగింది. ఆశ పీడిస్తోంది. రెండు చేతులూ జోడించింది_

"మీరు తలుచుకుంటే ఎలా అయినా అవుతుంది. కొస్త పుణ్యం కట్టుకోండి_ చల్లనివేళ దీపం పెట్టుకుని మీ పేరు తలుచుకుంటాం...."

"చల్లనివేళ దీపంపెట్టి నా పేరు తల్చుకుంటారా? ఎందుకండీ? కారవ నరకంలో మగ్గిపోవటానికా?" నిరసనగా శ్యామల అంటుంటే కుసుమ ముఖం వడిలిపోయింది_ వంచిన తల ఎత్తలేకపోయింది.

"సరే! మీ అబ్బాయిని రేపు బయోడేటాతో నా దగ్గరికి రమ్మనండి. నేను వెళ్లాలి_" అని లేచింది శ్యామల.

"తప్పకుండా! తప్పకుండా పంపుతాను_ మీకు చాలా చాలా థాంక్స్_" వంగి నమస్కరించింది కుసుమ.

వేగంగా పోతున్న అంబాసిడర్ కార్లో వెనక్కు జార్లగిలబడి తనలో తను

నవ్వుతుంది శ్యామల_ ఈనాడు వంగి నమస్కారం చేసిన కుసుమ ఆనాడు ఏమందీ?!

"సారీ! శ్యామలా! నువ్వు మా యింట్లో ఉండడం మావారికి ఇష్టంలేదు. ఇలాంటి విషయాలు కుటుంబాలకు ఎంతో అప్రతిష్ఠ_ తెస్తాయి" అంది. అవును తనవల్ల కుటుంబానికి అప్రతిష్ఠ_ అంది. ఒక మరబొమ్మలా పతిదేవుడి ఆనతి శిరసావహించి తనను - చిన్ననాటి స్నేహితురాలిని_ నిరపరాధి అని నిశ్చయంగా తెలిసినదానిని - నిర్దాక్షిణ్యంగా బయటకు తరిమేసింది_ ఇలా మరబొమ్మలా బ్రతుకుతూ తమను తాము పతివ్రతలమని.. అభినందించుకొంటున్నారు_ తను అలాంటి మరబొమ్మ కాలేనందుకే ఆనాడు "కుటుంబాలకు అప్రతిష్ఠ" తెచ్చే మనిషయింది_ ఈనాడు ఆ పతిదేవుడే ఈమెను వెళ్ళమన్నాడు కాబోలు, తన దగ్గరికి! ఈ పతివ్రతా శిరోమణి పతి ఆజ్ఞ శిరసావహించి వచ్చింది, తన దగ్గరికి.

ఆనాడు తను చేసినదానిలో తప్పేముందీ? తప్పేమీ లేదని ఈనాటి తన చరిత్ర చెప్తోనేవుంది.

కాలం మారింది, మారింది_అంటారు. ఏం మారింది? ఆడపిల్లకు ఇరవై ఏళ్ళు రాగానే పెళ్ళిచేయాలనే తలిదండ్రుల ఆరాటం మారలేదు. కట్నాల బేరాలు మారలేదు_ పెళ్ళిచూపుల తతంగాలు మారలేదు_ పెళ్ళయ్యాక అత్తింటి కాపురంలో అసలు మార్పులేదు_ తనకు ఇరవైయ్యేళ్ళు నిండాక బి.ఏ. పాసయ్యాకే పెళ్ళయింది_ అయితే మాత్రం ఏంలాభం? అనేక ఆంక్షలతో ఆడపిల్లల కాలేజీలో చదివి తెచ్చుకున్న ఆ డిగ్రీతో సంపాదించుకున్న లోకజ్ఞానం ఎంత? పెళ్ళంటే - సంసార జీవితమంటే - రచయిత్రుల నవలలా వుంటుందనుకొని ఎంతో సరదా పడింది_ ఉత్సాహంగా వచ్చింది అత్తవారింటికి_ ఆ యింట్లో అడుగుపెడుతూనే తన ఉత్సాహపు వాగు మీద చన్నీళ్ళు జల్లినట్లైంది_ సూటిపోటి మాటలూ దెప్పిపొడుపులూ - వ్యంగ్య బాణాలూ_ మడులూ ఆచారాలూ_ వీటిమధ్య ఊపిరాడనట్లే అయింది.

"ఆడపిల్ల అన్న తర్వాత సర్దుకుపోవాలి!" అనే పాఠం పసితనంనుంచీ నేర్చుకొంది కాబట్టి మనసు ఎంత గిలగిలలాడుతున్నా అన్నిటికీ సర్దుకుంటూనే వుంది.

అనుకోకుండా పుట్టింటి పరిస్థితులు మారాయి. తండ్రి పోయాడు. వున్నదంతా తనకు కట్నంగా ఇచ్చారు_ ఆస్తి ఏమీ లేదు. అన్న ఏదో ఉద్యోగం చేసుకుంటున్నా, అతడి సంసారం అతనికుంది_ ఈ పరిస్థితుల్లో తల్లి జబ్బుపడింది_ అత్తగారి అనుమతి తీసుకునే తల్లిని చూడటానికి వెళ్ళింది_ తల్లి తనను కౌగిలించుకుని బావురుమని ఏడ్చింది_ ఆ ముఖంలో దైన్యం చూడలేకపోయింది_ "నేను ఆస్పత్రికి వెళ్ళనే!" అని ఏడ్చింది తల్లి_ శ్యామలకి పరిస్థితి అర్థమయింది_

అన్న శ్యామలని చాటుగా పిలిచి "శ్యామూ! నా పరిస్థితి చూస్తున్నావుగా! వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నానన్న మాటేగాని ఏ నెల కా నెల ఇల్లు గడవటమే కష్టంగా వుంది. ఇప్పుడు అమ్మని గవర్నమెంట్ ఆస్పత్రికి పంపక నేను చెయ్యగలిగిందేముంది చెప్పు? ఇంటికి డాక్టర్ని పిలిపించి వైద్యం చేయించగలిగే స్థితిలో వున్నానా నేను?" అన్నాడు.

శ్యామల ఆలోచనలో పడింది. ఏం వింద్తో, ఏం చూసిందో తల్లికి సైకాలజికల్‌గా గవర్నమెంట్ హాస్పిటల్ అంటే భయం పట్టుకుంది. అక్కడ చేర్పిస్తే ఎప్పుడో పోయే ప్రాణం ఇప్పుడే గుటుక్కుమంటుంది. అన్న పరిస్థితి చూస్తూ చూస్తూ ఇంటికి డాక్టర్ని పిలిపించి వైద్యం చేయించమని ఎలా అనగలదు?

తను ఉద్యోగం చేసి తల్లికి వైద్యం చేయించాలని నిశ్చయించుకుంది శ్యామల. అదృష్టవశాన చిన్నప్పుడు తను చదివిన కాలేజీలోనే డిమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన తర్వాతనే ఆ వార్త అత్తగారింట్లో చెప్పింది. పెద్ద దుమారం రేగింది. "మా ఇంటి కోడలు ఉద్యోగాలు చేసి ఊళ్ళేలక్కర్లేదు. ఎంత చదువుకున్నా, ఎంచక్కగా శ్రావణ మంగళవారాలూ, శ్రావణ శుక్రవారాలూ, నోములు నోచుకుంటూ లక్షణంగా ఇంట్లో వుండవలసిందే! మాకు ఉద్యోగాలు పనికిరావని ముందే చెప్పాము." అంది.

"ఓహో! ఈవిడగారు ఉద్యోగం చేసుకుంటూ పుట్టింట్లో వుంటుందనమాట! అయితే అన్నయ్య కాపరానికి వెడతాడా ఏమిటి?" విరగబడి నవ్వుతూ వెక్కిరించింది ఆడబిడ్డ.

రాత్రి ఒక్క క్షణమయినా నిద్ర పోనియ్యకుండా తన ప్రేమనంతా గుమ్మరించే పతిదేవుడు రుసరుసలాడుతూ "అక్కడ నువ్వు సంపాదించి మీవాళ్ళకు పెట్టిపోస్తోంటే, ఇక్కడ నేనేం కావాలి? నీకు ఉద్యోగం కావాలనుకుంటే ఇక్కడుండి చెయ్యి_ నీ జీతం మనకే వుంటుంది_" అన్నాడు ఉదారంగా_

శ్యామల కొక్కసారిగా పెళ్ళిమీదా, అత్తవారింటిమీదా, భర్తమీదా, అందరిమీదా విరక్తి కలిగింది_ మొదటిసారిగా ఏదో తెగింపు వచ్చేసింది. ఎవ్వరినీ లెక్కచెయ్యకుండా బట్టలు సర్దుకొని తల్లిదగ్గరకు వచ్చేసి ఉద్యోగంలో చేరిపోయింది.

డాక్టర్ ఇంటికొచ్చి వైద్యం చేస్తోంటే తల్లి మొదట్లో చాలా ఆనందించింది_ కానీ_ అందుకోసం కూతురు తన కాపురం

వదిలి వచ్చిందని తెలియగానే లబోదిబో మంది-

"శ్యామా! నాకీ వైద్యం వద్దే! నువ్వు మీ అత్తారింటి కెళ్ళిపోవే! కాటికి కాళ్ళు చాపుకున్నదానిని- నాకోసం నీ బ్రతుకు నాశనం చేసుకోకే!" అని దీర్ఘాలు తీసింది.

"ఇప్పుడు నా బ్రతుకు ఏం నాశన మయిందమ్మా?" అడిగింది శాంతంగా శ్యామల-

శ్యామల ఏం మాట్లాడుతోందో, తల్లి కర్థం కాలేదు-

"అదేమిటే, సంసారం వదులుకుని వచ్చేసి, ఇంకా ఏం నాశనమంటావేమిటే? ఇంతకంటె సర్వనాశన మేముందే?" తల్లి ఏం మాట్లాడుతుందో శ్యామల కర్థం కాలేదు - అభిప్రాయ భేదాలు వచ్చి సంసారం వదిలేసినంతమాత్రాన ఆడదాని జీవితం సర్వనాశనమయిపోతుందా? ఎన్నెన్ని కలతలతో కుళ్ళిపోతున్నా, నాలుగు గోడల మధ్యా వుంటే, సకల సౌభాగ్యాలూ వున్నట్లేనా?

"వెళ్తానులే! ముందు నీ ఆరోగ్యం బాగుపడనీ!" అని తల్లికి మాత్ర అందించింది.

అది మింగి "నా ఆరోగ్యం పాడు కానూ!" అని తల పగలకొట్టుకుంది తల్లి -

శ్యామల భర్తకు అతని తలిదండ్రులు వేరే సంబంధాలు చూస్తున్నారని వార్త వచ్చింది- అప్పటివరకూ తల్లికి కాస్త ఆరోగ్యం చక్కబడగానే ఉద్యోగం మానేసి అత్తవారింటికి వెళ్ళిపోవాలనే ఆలోచనలోనే వుంది శ్యామల. అది భర్తమీద ప్రేమతో కాదు- సంసారం మీది అపేక్షతోనూ కాదు- లేనిపోని గొడవలు పడలేక- "ఏదో ఒకలాగ జరిగిపోనీ!" అనే ఒక ఉదాసీనభావంతో.

తన భర్తకు మరో పెళ్ళివార్త శ్యామల మనసును విచిత్రంగా మార్చే



సింది. ఏదో రోషజ్వాల రగిలింది మనసులో! వెనుకటి ఔదాసీన్యం కూడా మాయమయి పూర్తిగా విరక్తి పెరిగింది.

తల్లి మాత్రం ఈ వార్తకు తట్టుకోలేకపోయింది. "అయ్యో! అయ్యో! తెగేదాకా తాడు లాగొద్దంటే విన్నావటే? ఇప్పుడు అతడు మరొకళ్ళని పెళ్ళిచేసుకుంటే, నీ గతేం కావాలే! ఇప్పటికైనా త్వరగా మీ యింటికి పోవే! పోయి అతని కాళ్ళమీద పడు-"

తల్లికి కలిగిన ఆవేదనలో నాలుగో వంతైనా శ్యామలకి కలగలేదు- వాళ్ళ కాళ్ళమీద పడి బ్రతిమాలుకోవలసినంత తప్పు తనేం చేసిందో అర్థంకాలేదు-

అంతలో భర్త రాయబారానికి వచ్చాడు- తల్లి పొంగిపోయింది- మంచంలో వుండే, అల్లుడిగారి మర్యాదల కోసం ఆరాటపడింది- అతి సామాన్యంగా ఆహ్వానించింది శ్యామల-

"ఇప్పటి కయినా నువ్వు వచ్చేస్తే అమ్మతో చెప్పి పెళ్ళిప్రయత్నాలు మాని పిస్తాను-" అన్నాడు భర్త.

"వస్తాను- కానీ, ప్రస్తుతం నా జీవితం మా అమ్మ వైద్యానికే ఖర్చు చెయ్యాలి!"

"అయ్యో! నా వైద్యం సంగతి ఎత్తకే! నేను చచ్చినా ఫరవాలేదు- మీరు- మీరు సుఖంగా ఉంటే చాలు!" అని గోలపెట్టింది తల్లి. శ్యామలకి చాలా చికాగ్గా వుంది. అక్కడినుంచి ఎక్కడికైనా పారిపోవాలని అనిపించింది.

"నువ్వు అలా షరతులు పెట్టడానికి వీల్లేదు. మా యింటి కొచ్చాక అందరం కలిసి ఆలోచించుకుని ఎలా బాగుంటే అలా చేద్దాం!"

"అయితే నేను రాను!"

"బాగా ఆలోచించుకొని చెప్తున్నావా?"

"ఇందులో ఆలోచించుకోవటాని కేం వుంది?"

భర్త కోపంతో వెళ్ళిపోయాడు-

అయితే, ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే లోకంలో ఆడవాళ్ళందరూ, ఎన్ని చికాకులైనా అనుభవిస్తూ తమ సంసారాల్లోనే ఎందుకుండిపోతారో, బయటకు వచ్చి స్వతంత్రంగా జీవించగలిగే అవకాశాలున్నా ఎందుకు రారో శ్యామలకి అర్థమయిపోయింది.

తల్లి తను తెచ్చిన డాక్టర్‌తో వైద్యం చేయించుకుంటూనే, తానేదో మహాపరాధం చేసినట్లు చూసేది.

తను పూలు పెట్టుకున్నా, మంచి చీర కట్టుకున్నా వదిన హేళనగా చూసేది. ఆ రకంగా అలంకరించుకునే హక్కు తనకు లేదన్నట్లు వ్యంగ్యంగా మాట్లాడేది తను "అశోకవనంలో సీత"లాగ ఉండాలని ఉదారంగా సూచనలు ఇచ్చేది.

ఇంట్లోనే కాదు_ కాలేజిలో సహితం శ్యామలకూ ప్రతికుల వాతావరణమే ఎదురయ్యేది_ బాగా చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న ఆ మహిళలందరూ పరిహాసపు చూపులతో వ్యంగ్య వాగ్బాణాలు విసిరేవారు. అభ్యుదయ భావాలు వున్నాయని చాటుకుంటూ బయట స్త్రీజాతి విముక్తికి ఉపన్యాసాలు దంచేవారు సహితం, ఏదో ఒక వెక్కిరింపు మాట అని తమలో తాము మహదానందాన్ని అనుభవించేవారు.

భర్తకు మరొకరితో పెళ్ళి అయిపోయింది. తల్లి చాలా కృంగిపోయింది. శ్యామలకు మాత్రం బాధకు బదులు రిలీఫ్ కలిగింది_ తనమీద ఏమాత్రం ప్రేమలేని అతడు_ తలిదండ్రుల చేతిలో మరబొమ్మలాంటి అతడు_ మరొకరిని పెళ్ళిచేసుకుంటేనేం? అతనికి మరబొమ్మలాంటి మరో భార్య దొరికితే ఆ ఇద్దరూ అయినా సుఖపడతారేమో!

తల్లి మాత్రం ఓపికున్నప్పుడల్లా సణుగుతూ, సణుగుతూనే చచ్చిపోయింది_ అప్పటికే అంతంత మాత్రంగా వున్న వదిన తల్లిచావుకు శ్యామలే కారణమన్నట్లు మాట్లాడింది. శ్యామల సహించలేకపోయింది. వదినతో ఘర్షణపడింది_ మాటా మాటా పెరిగింది. "నీలాంటిది ఇంట్లో వుంటే రేపొద్దున్న నా పిల్లలకు పెళ్ళికాదు_" అనేసింది వదిన. శ్యామల తన సూట్‌కేస్ తీసుకుని అన్న ఇల్లు అప్పటికప్పుడు వదిలేసింది. వదిన కోపానికి అసలు కారణం శ్యామలకి తెలుసు_ అప్పటివరకూ జీతమంతా ఇంట్లో ఇచ్చేది. ఆ నెల తన జీతంతో చీరలు కొనుక్కుంది. అది వదినకు కుళ్ళు_ ఎప్పటికప్పుడు ఎవరో ఒకరి అదుపాజ్ఞలలో వుండవలసిందేనా? ఎందుకుండాలి? తను చేయరాని పని ఏంచేసింది?

అప్పటికప్పుడు ఎక్కడికి వెళ్ళాలో తోచక కాలేజిలో కాస్త స్నేహంగా వుండే కుసుమకుమారి ఇంటికి వెళ్ళింది. తెల్లపోయిన కుసుమకుమారికి జరిగింది చెప్పి, "కొద్ది రోజులు మీ యింట్లో వుంటాను_ ఆ తర్వాత ఏదో ఏర్పాటు చూసుకుంటాను_ కాఫీ, భోజనమూ, అన్నీ హోటల్ నుంచే తెప్పించుకుంటాను. మీకేమీ ఇబ్బంది కలగనివ్వను." అంది.

అయిష్టంగానే "అలాగే" అంది కుసుమ_ తన పిల్లలగది చూపించింది వుండటానికి. కుసుమ భర్త వచ్చాక అతనికీ కుసుమకూ జరిగిన సంభాషణ అంతా శ్యామల చెవులో పడుతోనే వుంది.

"ఆవిడగారు ఇక్కడి కెందుకో వచ్చింది?"

"వేరే ఏర్పాటు చూసుకునేవరకూ మనింట్లో వుంటుందట! మనకే ఇబ్బందీ రాకుండా అన్నీ హోటల్ నుంచి తెప్పించుకుంటానంది_"

"చాల్లే! వెంటనే దయచేయమను. ఆవిడగారి విప్లవభావాలన్నీ నీకూ నేర్పిందంటే, నేను చావాలి! ముందు బయటకు పొమ్మను_ లేకపోతే ఆవిడతో పాటు నువ్వూ బయటికి పో!"

చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఆడదానితో ఇలా మాట్లాడుతున్నాడు భర్త!

కుసుమ వడలిపోయిన ముఖంతో వచ్చి "సారీ శ్యామా! మావారి కిష్టం లేదు_ ఇలాంటి విషయాలు కుటుంబాలకు అప్రతిష్ఠ తెస్తాయి చూడు...." అని నసిగింది_

శ్యామల అప్పటికే సూట్‌కేస్ సర్దుకొంది_ అది చేతిలోకి తీసుకుని "మీవారు ఎప్పుడూ ఇలాగే మాట్లాడతారా? నువ్వు అదంతా సహిస్తోనే వింటావా?" అంది కొంచెం ఆశ్చర్యంగా_

కుసుమ చిన్నబుచ్చుకొని "ఎప్పుడూ ఇలా ఎందుకు మాట్లాడతారు? ఆయనకు నేనంటే చాలా ప్రేమ! తనకు ఇష్టం లేని పనులు చేసినప్పుడే....అయినా పిల్లలతల్లిని. ఇంతకూ అంతకు సంసారాలు పాడుచేసుకుంటే ఎలా?" అంది కాస్త చెప్తున్నట్లు.


కుసుమ తనకు ఇష్టంలేని పనులు చెయ్యనంతవరకూ అతనికి కుసుమంటే ప్రేమ! భలేగా వుంది ఈ ప్రేమ! మూడువంతులు అందరి ప్రేమలూ ఇంతేనేమో! కుసుమ పిల్లలతల్లి! ఈ దృష్టితో తను ఆలోచించలేదు ఇంతవరకు....తన సంతానం కోసమే ఆడది ఎంతో సహనాన్ని తెచ్చిపెట్టుకుంటుంది. మరీ అలవిమీరినప్పుడు తప్ప తిరగబడలేకపోతోంది!

కుసుమ ఇల్లు వదిలాక శ్యామల తెగించి ఒక మంచి హోటల్‌రూమ్ తీసుకుని అందులో చేరింది_ వయసులో వున్న ఆడది, ఒంటరిగా హోటల్‌లో వుంది_ అనగానే అందరి చూపులు శ్యామలమీదే! కుతూహలంగా ఆకలితో_ వెకిలిగా శరీరాన్ని కెలికే చూపులు —— ఏమి సంఘం ఇది? అలిసిపోయిన శ్యామలను ఏదో నీరసం ఆవహించింది_ అంతలో తనకు తను హెచ్చరించుకుని మొండి ధైర్యంతో నిలబడింది. హోటల్

మేనేజర్, లక్ష ప్రశ్నలు వేసాడు- మనసు చిరచిరలాడుతున్నా శాంతంగా గంభీరంగా సమాధానాలు చెప్పింది-

ఒంటరిగా ఈ నడక ఎంత కష్టమో శ్యామలకు అర్థమయ్యింది.

లోకంలో అందరూ దుర్మార్గులే వుండరు. డిమాన్‌స్ట్రేటర్‌గా శ్యామల సంపాదించుకొన్న మంచి పేరువల్ల- ప్రిన్సిపాల్ మంచితనంవల్ల శ్యామలకి కాలేజి హాస్టల్‌లోనే సీట్ దొరికింది. అప్పటినుంచి శ్యామల ఒక మహాయజ్ఞం లాగా తన జీవితాన్ని తాను నిర్మించుకోవటం ప్రారంభించింది. కాలేజిలో ఉద్యోగం చేస్తోనే కంపెనీ సెక్రెటరీ కోర్స్ పాసయింది. అహర్నిశలూ చదువు తప్ప మరో వ్యాపకం లేకుండా శ్రమించింది. జనరల్ నాలెడ్జి అభివృద్ధి చేసుకుంది. ఒక మంచి కంపెనీలో సెక్రెటరీగా ఉద్యోగం దొరికింది- ఆ కంపెనీ ప్రొప్రైటర్ భరత్ సింగ్‌కి ఈ కంపెనీయే కాక, ఇంకా అనేక వ్యాపారాలున్నాయి. రాజకీయాలలోనూ తిరుగుతుంటాడు. ఒకటి రెండుసార్లు ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయాడు- శ్యామలను చూడగానే ఆమెపట్ల ఆకర్షితుడయ్యాడు. ఏదో వంకతో ఊళ్ళో ఉన్నప్పుడల్లా ఆమె దగ్గర వచ్చి కూచుంటాడు. శ్యామలకు అర్థమయింది. ఆలోచించుకుంది. అతడు ఒప్పుకుంటే, అతడిని పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకుంది. శ్యామలలో అసాధారణమైన ఆకర్షణ వుంది. సింగ్ అందగాడు కాదు, కాని అనాకారి కాదు. చనువు పెరగనిచ్చింది- అందరూ చెవులు కొరుక్కోసాగారు. ఇలాంటివేవీ లక్ష్యం చెయ్యక్కర్లేని దశకు ఎదిగిపోయింది శ్యామల. ఎవరితో ఎలా మెలగాలో కూడా నేర్చుకొంది. సింగ్ ప్రేమ ప్రస్తావన తేగానే, తన విషయం అంతా చెప్పి పెళ్ళిచేసుకుంటే తనకు




అభ్యంతరం లేదంది- సింగ్ కూడా ఆలోచనలో పడ్డాడు- శ్యామల అందమే కాక, ఆమె కార్యదక్షతకూడా అతనికి నచ్చింది. తన పరోక్షంలో కంపెనీ వ్యవహారాలు చూసుకోగలదు. ఆమె ప్రవర్తన కూడా నచ్చింది. ఇన్ని రోజులుగా చనువు ఇస్తోనే ఎంత దూరంలో వుండాలో అంతదూరంలో వుంచగలిగింది. శ్యామలను పెళ్లిచేసుకోవటానికి సింగ్ ఒప్పుకున్నాడు. ఇద్దరూ రిజిస్ట్రారాఫీసులో పెళ్ళిచేసుకుని బాహాటంగా పార్టీ ఇచ్చారు-

"అందమైన అమ్మాయికోసమే ఇన్నాళ్ళు ఆగాను. ఇప్పటివరకూ నాకు నచ్చితే, వాళ్ళకు నచ్చక, వాళ్ళకి నచ్చితే, నాకు నచ్చక - సంబంధాలన్నీ తప్పిపోయాయి- ఇంతకూ నువ్వు నా జీవితంలోకి వచ్చే అదృష్టం నాకు రాసి ఉంది-" అని సింగ్ అన్నప్పుడు శ్యామల ఆనందించింది.

పెళ్ళయ్యాక శ్యామల కూడా సింగ్‌తోపాటు రాజకీయాలలో పాల్గొంది. తాను దేనికీ పోటీచేయకపోయినా, సింగ్ తరఫున ప్రచారం చేసింది- శ్యామల చాకచక్యంవల్లనే సింగ్ ఎన్నికయ్యాడు. మంత్రి కూడా అయ్యాడు. శ్యామల సౌందర్యమూ, కార్యనిర్వాహకత్వమూ, వాక్చాతుర్యమూ త్వరలోనే ఆమెను చాలా ప్రముఖురాలిని చేసాయి.

ఒకరోజున శ్యామలను చూడటానికి ఒకావిడ వచ్చింది- లోతుకుపోయిన కళ్లు- చప్పిదవడలు- అస్థిపంజరంలాంటి శరీరం- కళాకాంతులులేని ముఖం-చాలా దయనీయంగా వుంది రూపం-

"కూర్చోండమ్మా! మీ రెవరు?" అంది- ఆవిడ నీరసంగా నవ్వి.

"నేను మీ మొదటి మొగుడి రెండో భార్యని-" అంది-

ఆ మాటలు ఎంత 'ఆడ్'గా ఉన్నా, మొదట నవ్వు వచ్చింది. అ తలో ఏదో చికాకు కలిగి ది. తను మరచిపోదామనుకున్న పీడకల తన కళ్ళముందు కనిపించినట్లనిపించింది. కొద్ది కటువుగా "ఏం కావాలి'" అంది-

ఆవిడ చేతులు జోడించి "మీరలా మాట్లాడితే నేనేమీ చెప్పలేను - పుట్టెడు చిక్కుల్లో ఉండి, మీరు సాయపడతారని వచ్చాను-" అంది.

"చెప్పండి-"

"నేను హిందీ పరీక్షలు పాసయ్యాను. జిల్లా పరిషత్ స్కూల్లో హిందీ పండిత్ పోస్ట్ కావాలంటే అప్లైచేసాను- దయచేసి నాకు కాస్త ఆ ఉద్యోగం వచ్చేలాగ చూడగలిగితే...."

ఆశ్చర్యపోయింది శ్యామల.

"మీకు వయసు సరిపోతుందా?"

"సరిపోతుంది_ నాకింకా ముప్పై నిండలేదు_"

మరోసారి ఆశ్చర్యపోయింది. ఎంత గంభీరంగా వుందామనుకున్నా కుతూహలం అణచుకోలేక "మీవారు మిమ్మల్ని ఉద్యోగం చెయ్యనిస్తారా?" అంది.

"మొన్నటివరకూ చెయ్యనివ్వలేదు_ మా అత్తగారికి కోడళ్ళు ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేదు_ ఆయన తల్లి మాట కాదనరు. నోములు నోచటం_ వంటా, వార్పూ_ ఇదే నా జీవితం_ ఇటీవల అత్తగారు పోయారు. పెరుగుతున్న ధరలతో ఇల్లు గడవటం కష్టమయి ఆయనే ఉద్యోగం చెయ్యమన్నారు_లేక పోతే నేను రాగలనా?"

"మీ వారికి తెలుసా, మీ రిక్కాడికి వస్తున్నట్లు?"

"ఆయన వెళ్ళమంటేనే వచ్చాను. నిజానికి నాకు మిమ్మల్ని చూడాలని వుంది_"

కొంత సేపటివరకూ మాట్లాడలేక పోయింది శ్యామల_ ఆవిడని జాలిగా చూస్తూ "మీ ఆరోగ్యం బాగుండలేదా?" అంది_

"పెళ్ళయిన కొత్తల్లోనే గోరింత దగ్గు వచ్చింది. ఎవరూ డాక్టర్‌కి చూపించలేదు_ మా అత్తగారు తనకు తోచిన వైద్యమంతా నామీద ప్రయోగించింది_ తగిన పత్యపానాలు లేవు_ పోషణ అసలు లేదు_ చివరికిలా దీర్ఘ రోగిలా తయారయ్యాను. మీకు తెలియనిదేముంది? ఎప్పుడూ బోలెడు మంది చుట్టాలు_ చేసిన ఫలహారాలు నాదాకా రావు. ఒంటిగంట దాటాక కాని భోజనానికి కూచోవటానికి వీలుకాదు_ ఎలా వుంటాను చెప్పండి?"

"మరి ఈ పరిస్థితిలో విశ్రాంతి తీసుకోక ఉద్యోగ మెందుకు?"

"ఇంట్లో వుంటే, నాకు విశ్రాంతి వుంటుందా? ఉద్యోగం వంకతోనయినా కాసేపు బయట వుండవచ్చు. అదీగాక, మా పెద్దవాడు రెండుసార్లు మెట్రిక్ తప్పాడు. ఈసారైనా ట్యూషన్ పెట్టి చదివించాలి. రెండోదానికి ఎలా వచ్చిందో కంట్లో మెల్ల వుంది. అప్పోసప్పో చేసి ఆపరేషన్ చేయించకపోతే దానికి పెళ్ళి కాదు_ మూడోది యింకా చిన్నపిల్లనుకోండి_ నేను ఉద్యోగం చేస్తానంటున్నది సరదాకి కాదండీ_ అవసరానికి...."

"సరే! మీ బయోడేటా, మీరు అప్లై చేసిన ఉద్యోగ వివరాలూ ఇచ్చివెళ్ళండి_ ప్రయత్నిస్తాను_"

"థాంక్స్!"

ఆవిడ వెళ్ళిపోయాక చాలాసేపటి వరకూ కదలలేకపోయింది శ్యామల. ఆవిడ స్థానంలో తనను తాను ఊహించుకొని భయంతో జలదరించింది. ఆనాడు తనభర్త రెండవ పెళ్ళి చేసుకున్నప్పుడు అందరూ తన జీవితం నాశనమయి పోయిందన్నారు. తనొక్కతే అలా అనుకోలేదు_ భగవంతుడా! అలా బక్కచిక్కి పెద్దవాళ్ళ మూర్ఖత్వాలకి ఆరోగ్యం ధారపోసి, సుఖమూ, సంతోషమూ అనేది లేకుండా జీవచ్ఛవంలా ఉంటే, జీవితానికి సార్థక్యమా? ఈ పరిస్థితులకు ఎదురుతిరగటం జీవితాన్ని నాశనం చేసుకోవటమా? ఎవరు కల్పించినవి ఈ అర్థాలు?

పబ్లిక్ స్కూలు ఫస్టురేంక్ తెచ్చుకొనే తన కొడుకును సంతృప్తిగా తలుచుకొంది శ్యామల_ పిల్లల తప్పు లేదు. సాధారణంగా ఎలా పెంచుతే అలా పెరుగుతారు అనుకొంది.

కుసుమకుమారి కొడుకుకు ఉద్యోగం దొరికింది. కుసుమకుమారి పరమానందంతో తను సెక్రెటరీగా ఉన్న మహిళా సమాజంవారి చేత శ్యామలకి ఘనసన్మానం ఏర్పాటుచేయించింది_ ఆ మహిళా సంఘ సభ్యులు చదువుకున్న వారే కాని, నలుగురిలో తిరిగేవారు కారు. సభలలో ఎలా మాట్లాడాలో కూడా తెలియనివారు_ మొదట మాట్లాడిన ప్రెసిడెంటు ఆడవాళ్ళని అలవాటుగా పొగిడే విధంగా "ఇలాంటి పతివ్రతామతల్లుల కారణంగానే మనదేశం ప్రఖ్యాతి పొందుతోంది_" అంది.ఆ తరువాతివారు అది అంది పుచ్చుకొని

"శ్యామలగారిలాంటి పతివ్రతలు స్త్రీ జాతికే గర్వకారణం!" అన్నారు_

శ్యామల మొదటి భర్త రెండవ భార్యకు కూడా ఉద్యోగం దొరికింది. ఆవిడ కూడా శ్యామల మెళ్ళో దండలేసి "ఇలాంటి పతివ్రతలు పదికాలాలపాటు చల్లగా ఉండి లోకానికి మేలుచేయాలి!" అంది.

శ్యామల తన సన్మానానికి సమాధానం చెపుతూ "మీరంతా నన్ను పతివ్రత అని గౌరవించారు. కానీ, ఒకనాడు ఈ లోకమే నన్ను పతిత అని ఈసడించింది. నేను పతితనూ కాను. పతివ్రతనూ కాను_ మనసున్న _ వ్యక్తిత్వమున్న స్త్రీని. స్త్రీగా అర్థంచేసుకోగలిగితే అది చాలు. అంతకుమించిన ప్రశంసలు అక్కర్లేదు," అని కూచుంది. సభలో కరతాళ ధ్వనులు మోగాయి.

---